# పెద్దోళ్లే అండే అర్హత

## సబ్‌కాంట్రాక్టర్ కాదు... అయినా అధికారికంగా పనులు

### దీపికా సంస్థ అక్రమాలు ▫ రూ.వెయ్యి కోట్ల పనులపై కన్ను ▫ సాగునీటి శాఖలో విడ్డూరం

హైదరాబాద్, కృష్ణా- న్యూస్‌టుడే

సాగునీటి శాఖలో వేల కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయి. మరి ఈ నిర్మాణాలు పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే.. అన్ని విధాలా అర్హులైన కాంట్రాక్టర్లే వీటిని నిర్మించాలి. లోగడ ఇలాంటి పనులు చేసిన అనుభవం అతడికి ఉండాలి. లేకుంటే సదరు నిర్మాణాల భవిత ప్రశ్నార్థకమే! ప్రస్తుతం మాత్రం... కాంట్రాక్టర్లకు అర్హత, అనుభవం అస్సలు అవసరం లేదు. అధికార పార్టీ నేతల అండదండలు, ఇంజినీర్ల సహకారం ఉంటే చాలు. ఎన్నికోట్ల పనులైనా దక్కించుకోవచ్చు. రాత్రికి రాత్రి కోట్లకు పడగలెత్తవచ్చు. కృష్ణాడెల్టా ఆధునికీకరణ పనుల టెండర్లే ఇందుకు సాక్ష్యం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి దీపికా కన్‌స్ట్రక్షన్ అనే సంస్థకు ఏడాదికి కనీసం రూ.20 కోట్ల పనిచేసిన అనుభవం కూడాలేదు. అయినా రూ.315 కోట్ల పనిని సబ్‌కాంట్రాక్టు కింద అధికారికంగా తీసుకోవడానికి అనుమతించారు. ఇప్పుడేమో ఒకడుగు ముందుకేసి ఏకంగా రూ.వెయ్యికోట్ల విలువైన కృష్ణా డెల్టా ఆధునికీకరణకు సంబంధించిన పనులను కట్టబెట్టేందుకు రంగం సిద్ధంచేశారు.

#### పేరెక్కడ?

నీటిపారుదల ప్రాజెక్టుల కింద 20 మంది మాత్రమే సబ్ కాంట్రాక్టర్లు ఉన్నట్లు భారీ నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య గత వారం అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ జాబితాలో దీపికా సంస్థ పేరు లేదు. జలయజ్ఞంలో భాగంగా ఎంపిక చేసిన మొదటి కేటగిరీ, రెండవ కేటగిరీ కాంట్రాక్టర్ల జాబితాలో కూడా ఈ సంస్థ లేదు. అయినా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో రూ.315 కోట్ల పనిని సబ్ కాంట్రాక్టు తీసుకొంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మూడవ లిప్టు పనిని గ్యామన్ ఇండియా దక్కించుకొంది. ఈ పని విలువ రూ.632 కోట్లు. ఇందులో 50 శాతం పనిని సబ్ కాంట్రాక్టు ఇవ్వొచ్చు. అయితే సబ్ కాంట్రాక్టర్‌కు కూడా అన్ని అర్హతలుండాలి. రూ.315 కోట్ల పనిని సబ్ కాంట్రాక్టు తీసుకోవాలంటే గతంలో ఈ స్థాయిలో పని చేసి ఉండాలి. ఎత్తిపోతల పథకాల్లో పని చేసిన అనుభవమూ ఉండాలి. కానీ దీపికా సంస్థకు ఈ అర్హతలేమీ లేవు. "రూ.315 కోట్ల పని అధికారికంగా దక్కించుకొనే స్తోమత ఈ కాంట్రాక్టర్‌కు ఉంటే, మొదటి కేటగిరీలోనే ఉండేవారు కదా? " అని సాక్షాత్తు నీటిపారుదల శాఖలోని ఓ సీనియర్ ఇంజినీర్ అభిప్రాయపడడం ఇక్కడ ప్రస్తావనార్హం. ఈ సంస్థ రెండవ కేటగిరీ కాంట్రాక్టు సంస్థల్లో కూడా అర్హత పొందలేదు. కానీ నిబంధనలకు తిలోదకాలిచ్చి రూ.315 కోట్ల పనిని సబ్ కాంట్రాక్టు ఇచ్చారు. ఎస్ఈ అధికారికంగా ఉత్తర్వులిచ్చారు. 2005 డిసెంబరు 21వ తేదీన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సూపరింటెండెంట్ ఇంజినీర్ సబ్ కాంట్రాక్టుకు ఆమోదం (లేఖ సంఖ్య: ఎస్ఈ/ఎంజికెఎల్ఐ/డీఈఈ/టి1/46/ఎం) తెలిపారు.

#### బహిరంగ రహస్యమే

దీపికా సంస్థ అర్హత లేకుండానే పని చేస్తున్నట్లు ఆ ప్రాజెక్టు పరిశీలనకు వెళ్లిన అధికారులందరికీ

(మిగతా 2లో)